చైనా చక్రబంధంలో భారత్!

శ్రీలంక, మాల్దీవులు, పాక్, బంగ్లా, ఆఫ్గనిస్థాన్ మారిషస్, భూటాన్‌లో చైనా అనుకూల సర్కార్లు

విదేశాంగ విధానంలో ప్రధాని మోదీ విఫలం



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): డ్రాగన్ దేశం చైనా చక్రబంధంలో భారత్ చిక్కుకుపోయింది. ప్రధాని మోదీ విదేశాంగ విధానంలో, దౌత్య సంబంధాలను నెరపడంలో విఫలమవ్వడమే దీనికి కారణంగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భారత్‌కు పొరుగున ఉన్న దాదాపు అన్ని దేశాలూ చైనాకు అనుకూలంగా మారడం గమనార్హం. శ్రీలంకలో తాజాగా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన అనుర కుమార దిసనాయకే మార్క్సిస్ట్ నేత. ఇక, మాల్దీవుల్లో గత ఏడాది జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో భారత్‌కు వ్యతిరేకిగా పేరుపొందిన మహమ్మద్ ముయిజ్జు గెలిచి అధ్యక్షుడయ్యారు. చైనా నుంచి పెద్దయెత్తున రుణాలు వస్తుండటంతో వీలుచిక్కినప్పుడల్లా భారత్‌పై ఆయన విమర్శలు ఎక్కుపెడుతున్నారు. సరిహద్దు కయ్యాలతో భారత్‌లో ఉద్రిక్తతలకు కారణమవుతున్న పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్‌తో చైనా లోగుట్టు మైత్రీ బంధం బహిరంగ రహస్యమే. ఇక, బంగ్లాదేశ్‌లో మహమ్మద్ యూనస్ నేతృత్వంలో ఇటీవల ఏర్పడ్డ తాత్కాలిక ప్రభుత్వం, గతంలో చైనాతో సరిహద్దు వివాదాలను ఎదుర్కొన్న భూటాన్‌తో పాటు మారిషస్ కూడా చైనాలోని కమ్యూనిస్ట్ ప్రభుత్వంతో ఇప్పుడు సత్సంబంధాల కోసం ఉవ్విళ్లూరుతున్నాయి. వెరసి భారత్ చుట్టూరా ఉన్న పొరుగు దేశాలన్నీ ఇండియాను కాదని చైనా స్నేహ హస్తాన్ని కోరుకోవడం 'భారత్‌ను ఒక విధంగా చక్ర బంధంలో బంధించడమే'నని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. డ్రాగన్ కుయుక్తులను తిప్పికొట్టడంలో మోదీ ఫెయిలయ్యారని చెప్తున్నారు.

ఇజ్రాయెల్ దాడుల్లో 274 మంది మృతి

- 300 లక్ష్యాలపై దాడులు
- 1,000 మందికి గాయాలు

జెరూసలెం: హెజ్బొల్లా ఉగ్రవాదులకు ఇజ్రాయెల్ సైన్యం చుక్కలు చూపిస్తున్నది. 2006 తర్వాత అత్యంత భీకరంగా సోమవారం దాదాపు 300 లక్ష్యాలపై దాడులు జరిపింది. ఇందులో 274 మంది మరణించగా, సుమారు 1,000 మంది గాయపడ్డారు. హెజ్బొల్లాపై గగనతలం నుంచి విరుచుకుపడతామని, ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోవాలని దక్షిణ, తూర్పు లెబనాన్ ప్రజలను ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరించింది. హెజ్బొల్లా ఆయుధాగారాలపై దాడులు చేస్తామని చెప్పింది. దీంతో ప్రజలు లెబనాన్ రాజధాని నగరం బీరుట్ వైపు హుటాహుటిన కార్లు, తదితర వాహనాల్లో పరుగులు తీశారు.గత ఏడాది అక్టోబర్ నుంచి గత మంగళవారం పేజర్ల పేలుళ్లు జరిగే వరకు ఇజ్రాయెల్ దాడుల్లో సుమారు 600 మంది లెబనాన్ ప్రజలు మరణించారు. వీరిలో 100 మందికిపైగా సాధారణ ప్రజలు. మరిన్ని దాడులు చేయడానికి సైనిక ప్రధాన కార్యాలయం నుంచి ఆమోదం లభించిందని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. గలీలీలోని ఇజ్రాయెల్ సైనిక స్థావరంపై డజన్లకొద్దీ రాకెట్లను ప్రయోగించామని హెజ్బొల్లా తెలిపింది. ఇజ్రాయెల్ చర్యలు సమూల నాశనం కోసం యుద్ధంతో సమానమని లెబనాన్ ప్రధాన మంత్రి ఆరోపించారు.

హమాస్ చీఫ్ మృతి?

అక్టోబర్ 7 నాటి దాడుల రూపకర్త, హమాస్ అధినేత యాహ్యా సిన్వార్ మృతి చెందినట్టు ఇజ్రాయెల్ దళాలు అనుమానిస్తున్నాయి. సుదీర్ఘ కాలంగా అతడి కదలికలు లేకపోవటంతో అతడు సజీవంగా ఉండకపోవచ్చునని భావిస్తున్నాయి. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వెలువడ్డాయి.

లెబనాన్‌లోని ఓ గ్రామంపై ఇజ్రాయెల్ గగనతల దాడులతో వస్తున్న పొగ

పిల్లల పోర్నోగ్రఫీ వీక్షణ నేరమే!

- వీడియోలు డౌన్‌లోడ్, స్టోర్ చేసుకోవడం పోక్సో చట్టం కింద నేరపూరిత చర్యలే
- దేశ అత్యున్నత ధర్మాసనం కీలక తీర్పు
- పిల్లల అశ్లీల చిత్రాలు చూడటం నేరం కాదంటూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పు కొట్టివేత
- హైకోర్టు తీర్పు ఘోర తప్పిదమని వ్యాఖ్య

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): పిల్లల అశ్లీలత, వారిపై లైంగిక వేధింపులకు సంబంధించిన వీడియోలను చూడటం ముమ్మాటికీ నేరమేనని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. చైల్డ్ పోర్నోగ్రఫీ చూడటంతో పాటు ఆ వీడియోలను డౌన్‌లోడ్ చేయడం, స్టోర్ చేసుకోవడం కూడా పోక్సో చట్టం ప్రకారం నేరం కిందకే వస్తుందని పేర్కొంది. ఇలాంటి పనులకు తెగబడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని వెల్లడించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలాతో కూడిన ధర్మాసనం సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. చైల్డ్ పోర్నోగ్రఫీ చూడటం నేరం కాదంటూ మద్రాసు హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును కొట్టేసిన న్యాయస్థానం.. ఇలాంటి తీర్పునిచ్చి హైకోర్టు ఘోరమైన తప్పిదం చేసిందని వ్యాఖ్యానించింది.

ధర్మాసనం ఏమన్నదంటే?

- పోక్సో చట్టంలో 'చైల్డ్ పోర్నోగ్రఫీ' అనే పదాన్ని 'చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేటివ్ అండ్ అబ్యూసివ్ మెటీరియల్' అనే పదంతో మార్చాలి. ఈ మేరకు పోక్సో చట్టానికి సవరణలు చేయాలి.
- పై సవరణలు అమల్లోకి వచ్చేవరకు దీనిపై ఆర్డినెన్స్ జారీ చేయాలి. ఇకపై కోర్టులు 'చైల్డ్ పోర్నోగ్రఫీ' పదాన్ని ఉపయోగించవద్దు.
- చైల్డ్ పోర్నోగ్రఫీకి సంబంధించిన వీడియోలు స్టోర్ చేసిన వారికి తొలిసారిగా రూ. 5వేల వరకు జరిమానా విధించాలి.
- ఇలాంటి చర్యలకు మళ్లీ పాల్పడితే రూ.10 వేల వరకు జరిమానా వేయాలి. పిల్లల అశ్లీల వీడియోలను దురుద్దేశంతో ప్రసారం చేస్తే జరిమానాతో పాటు మూడేండ్ల వరకు జైలు శిక్ష విధించాలి.
- డబ్బుల కోసం చైల్డ్ పోర్నోగ్రఫీని ప్రోత్సహించడం, ఆ వీడియోలను ప్రసారం చేస్తే మూడు నుంచి ఐదేండ్ల పాటు జైలు శిక్ష విధించాలి. గరిష్ఠంగా ఏడేండ్ల పాటు జైలు శిక్ష విధించాలి.

ఏమిటీ కేసు?

చైల్డ్ పోర్నోగ్రఫీకి సంబంధించిన వీడియోలను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకున్నాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న 28 ఏండ్ల ఓ యువకుడిపై క్రిమినల్ చర్యలను నిలిపివేస్తూ మద్రాసు హైకోర్టు గతంలో ఆదేశాలిచ్చింది. పోక్సో, ఐటీ చట్టాల ప్రకారం.. చైల్డ్ పోర్నోగ్రఫీని చూడటం తప్పేమీ కాదంటూ ఆ సందర్భంగా వ్యాఖ్యానించింది. సదరు యువకుడు వీడియోలు చూడటం తప్ప ఏమీ చేయలేదని, వాటిని ఇతరులకూ పంపలేదని పేర్కొంది. పోర్నోగ్రఫీకి అలవాటుపడిన యువతను శిక్షించడం కన్నా వారిని సరైన మార్గం వైపు నడిపించడంపై దృష్టి పెట్టాలని అభిప్రాయపడింది. ఈ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. హైకోర్టు తీర్పును తోసిపుచ్చిన సుప్రీంకోర్టు సదరు యువకుడిపై క్రిమినల్ చర్యలను పునరుద్ధరించింది. చైల్డ్ పోర్నోగ్రఫీ వీడియోలను డౌన్‌లోడ్ చేసుకొన్నాడంటే, ఆ దురుద్దేశం యువకుడికి ఉందన్నది స్పష్టమవుతున్నదని కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది.

లైంగిక విద్యపై అపార్థాలు ఉన్నాయి: సుప్రీంకోర్టు

ఈ కేసు విచారణ సందర్భంగా లైంగిక విద్యపై ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'తల్లిదండ్రులు, అధ్యాపకులు సహా చాలా మంది శృంగారం గురించి చర్చించడం సరికాదని, అనైతికమని, ఇబ్బందికరమనే సంప్రదాయవాద భావాలు కలిగి ఉన్నారు. సెక్స్ ఎడ్యుకేషన్ అనేది పాశ్చాత్య అంశమని, సంప్రదాయ భారతీయ విలువలకు తగనిదనే భావన ఉంది. ఈ భావనతోనే వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు సెక్స్ ఎడ్యుకేషన్‌ను నిషేధించాయి. ఈ రకమైన వ్యతిరేకతతో సమగ్ర, సమర్థవంతమైన సెక్స్ ఎడ్యుకేషన్ అందకపోవడం వల్ల కౌమార దశలో ఉన్న వారికి తప్పుడు సమాచారం వెళ్తున్నది. వారు ఇంటర్నెట్ వైపు వెళ్లి నియంత్రణ లేని సమాచారం పొందుతున్నారు. సెక్స్ ఎడ్యుకేషన్ అంటే కేవలం జీవపరమైన పునరుత్పత్తి మాత్రమే అనే అపార్థం ఉంది. సమర్థవంతమైన సెక్స్ ఎడ్యుకేషన్‌లో అంగీకారం, ఆరోగ్యకరమైన సంబంధాలు, లింగ సమానత్వం వంటి అంశాలు ఉండాలి. శారీరక హింసను తగ్గించడం, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడంలో ఇవి కీలకం' అని జస్టిస్ పార్దివాలా పేర్కొన్నారు.

భారత్‌లో మంకీపాక్స్ తొలి కేసు

కేరళ వ్యక్తికి క్లేడ్-1 రకం వైరస్

న్యూఢిల్లీ: ప్రాణాంతక వైరస్‌గా డబ్ల్యూహెచ్‌వో ఇటీవల ప్రకటించిన మంకీపాక్స్ క్లేడ్-1బీ రకం వైరస్ భారత్‌లో ప్రవేశించింది. కేరళలో మలప్పురం జిల్లాకు చెందిన 38 ఏండ్ల వ్యక్తికి గతవారం ఈ వ్యాధి నిర్ధారణ అయినట్టు కేంద్ర ఆరోగ్య శాఖ సోమవారం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్యశాఖ అధికార ప్రతినిధి మనీశ్ వర్మ సోమవారం మీడియాకు తెలిపారు. దుబాయ్ నుంచి వచ్చిన అతడిని గతవారం కేరళ ప్రభుత్వం మంకీపాక్స్ అనుమానిత కేసుగా గుర్తించి, ఐసోలేషలో ఉంచింది. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. భారత్‌లో ఇప్పటివరకు 30 ఎంపాక్స్ కేసులు వెలుగులోకి రాగా, అవన్నీ క్లేడ్-2 రకానికి చెందినవిగా వైద్య పరీక్షలో తేలింది.

ఉల్లి ధరల కట్టడికి నిల్వల విక్రయం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: దేశవ్యాప్తంగా ఉల్లి ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ధరల పెరుగుదలను నియంత్రించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలకు దిగింది. ప్రభుత్వం వద్ద ఉన్న 4.7 లక్షల టన్నుల ఉల్లిగడ్డల నిల్వలను ప్రధాన నగరాల్లోని హోల్‌సేల్ మార్కెట్లలో విక్రయిస్తున్నది. దీంతో పాటు దేశవ్యాప్తంగా సబ్సిడీ ద్వారా రూ.35కు కిలో చొప్పున రిటైల్‌లో విక్రయించాలని భావిస్తున్నట్టు వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖారే సోమవారం తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీ సహా రాష్ట్ర రాజధానుల్లో సబ్సిడీ ధరకు ఉల్లి విక్రయాలు జరుపుతున్నట్టు చెప్పారు. కాగా, ఉల్లి ఎగుమతులపై సుంకాన్ని ఎత్తేయడంతో ఉల్లి ధరలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం రిటైల్ మార్కెట్లో కిలో ఉల్లిగడ్డల ధర దాదాపు రూ.60కు చేరుకుంది.

రైలు పట్టాలపై ఇనుప రాడ్లు

చండీగఢ్, సెప్టెంబర్ 23: పంజాబ్‌లో లోకో పైలట్ అప్రమత్తతతో తృటిలో ఘోర రైలు ప్రమాదం తప్పింది. ఆదివారం ఢిల్లీ-భటిండా మార్గంలో భంగి నగర్ ప్రాంతంలో రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తులు ఇనుప కడ్డీలను పెట్టారు. అయితే, ఓ గూడ్స్ రైలు లోకో పైలట్ అప్రమత్తంగా ఉండటంతో ప్రమాదం తప్పింది. పట్టాలపై ఇనుప రాడ్లు ఉన్నట్టు గుర్తించిన అతను సకాలంలో బ్రేకులు వేయటంతో ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు. రైల్వే ప్రొటెక్షన్ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇటీవల దేశవ్యాప్తంగా రైలు పట్టాలపై వివిధ రకాల వస్తువులు కనిపిస్తుండటం అటు రైల్వే శాఖ, ఇటు ప్రయాణికుల్లో కాస్త ఆందోళన కలిగిస్తున్నది.

వక్ఫ్ బిల్లుపై 1.2 కోట్ల స్పందనలు

న్యూఢిల్లీ: వక్ఫ్ (సవరణ) బిల్లుపై ఏర్పాటైన పార్లమెంటరీ ప్యానెల్‌కు కుప్పలు తెప్పలుగా ప్రతిస్పందనలు వచ్చిపడ్డాయి. బీజేపీ నేత జగదాంబికాపాల్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఈ ప్యానెల్ ఏకంగా 1.2 కోట్ల ఈ-మెయిల్స్ అందుకుంది. వక్ఫ్ సవరణ బిల్లుపై సలహాలు తెలియజేయాలంటూ కమిటీ గత నెలలో కోరింది. ఈ బిల్లును వ్యతిరేకిస్తూ తమ ప్రతిస్పందనలు పంపాలంటూ ప్రముఖ ఇస్లామిక్ బోధకుడు జకీర్‌నాయక్ తన మద్దతుదారులను కోరారు. బిల్లుకు అనుకూలంగా తమ స్పందనలు పంపాలని పలు హిందూ సంఘాలు కొరడంతో ఇబ్బడిముబ్బడిగా ఈ-మెయిల్స్ వచ్చిపడ్డాయి.

హంతకుడిని పట్టించిన ఉమ్మి

36 ఏండ్ల తర్వాత నిందితుడి అరెస్టు

బోస్టన్: అమెరికాలో 36 ఏండ్ల క్రితం జరిగిన కారెన్ టేలర్ అనే మహిళ హత్య కేసును దర్యాప్తు అధికారులు ఎట్టకేలకు ఇప్పుడు ఛేదించారు. 1988 మే 27న బోస్టన్‌లోని రాక్స్‌బరీ నైబర్‌హుడ్ అపార్ట్‌మెంట్‌లో జేమ్స్ హోలోమన్ అనే వ్యక్తి ఈ హత్యకు పాల్పడినట్టు డీఎన్ఏ సాక్ష్యాధారాల ఆధారంగా తేల్చారు. వాస్తవానికి అప్పట్లో టేలర్ మృతదేహం వద్ద హోలోమన్‌కు సంబంధించిన ఓ చెక్కును దర్యాప్తు అధికారులు గుర్తించినప్పటికీ కచ్చితమైన నిర్ధారణకు రాలేకపోయారు. కానీ, నిరుడు ఓ కాలిబాటపై హోలోమన్ వేసిన ఉమ్మి నుంచి అతని డీఎన్ఏను సేకరించి పరీక్షించగా హత్యకు ఆతడే పాల్పడ్డాడని తేలింది.

మళ్లీ అధికారంలోకి వస్తామన్నది చెప్పలేం!

అథవాలే మాత్రం మంత్రి అవుతారు: గడ్కరీ

నాగ్‌పూర్: తరచూ చమత్కారంగా మాట్లాడే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నాగ్‌పూర్‌లో ఆదివారం ఆయన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ, ''మా ప్రభుత్వం నాలుగోసారి అధికారంలోకి వస్తుందో, రాదో చెప్పలేం కానీ, రామ్‌దాస్ అథవాలే మాత్రం మరోసారి మంత్రి పదవి చేపడతారనే గ్యారంటీ కచ్చితంగా ఉంది'' అన్నారు. కేంద్ర మంత్రి అథవాలే తోపాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారంతా ఇందుకు చిరునవ్వులు చిందించారు. అనంతరం గడ్కరీ మాట్లాడుతూ, ''జస్ట్ జోక్ చేస్తున్నా'' అన్నారు. అథవాలే నేతృత్వంలోని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఏ) కూడా ఎన్డీయేలో భాగస్వామి. ఆయన వరుసగా మూడుసార్లు మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మరోసారి గెలిస్తే, మంత్రి పదవిని చేపట్టే పరంపరను కొనసాగిస్తానని చెప్పారు. మహారాష్ట్రలోని అధికార కూటమిలో కూడా ఆర్‌పీఐ (ఏ) భాగస్వామి. 288 స్థానాలున్న మహారాష్ట్ర శాసన సభ ఎన్నికలు త్వరలో జరుగుతాయి. రాష్ట్రంలో మహాయుతిలో భాగమైన తమ పార్టీకి 10-12 స్థానాలను ఇవ్వాలని అథవాలే అన్నారు.

దేవుడిని నమ్మితేనే ఒత్తిడిని జయించొచ్చు

- యువ సీఏ మృతిపై కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలు
- ఆమె వ్యాఖ్యలను తప్పపట్టిన నేతలు, నెటిజన్లు

నిర్మలా సీతారామన్, సెబాస్టియన్

చెన్నై: పని ఒత్తిడిని తాళలేక మరణించిన చార్టెడ్ అకౌంటెంట్(26) అన్నా సెబాస్టియన్ పెరయిల్ మృతిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. పని ఒత్తిడి గురించి మాట్లాడకుండా, దేవుడి కృపతోనే ఒత్తిడిని జయించవచ్చు అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలపై విపక్ష నేతలు, నెటిజన్లు మండిపడుతున్నారు. చెన్నై మెడికల్ కాలేజీలో జరిగిన ఓ కార్యక్రమంలో నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ... 'మన పిల్లలు విద్య కోసం కళాశాలలు, యునివర్సిటీలకు వెళ్లి అద్భుతంగా బయటకు వస్తారు. సీఏ చదివి ఓ సంస్థలో పని చేస్తున్న మహిళ పని ఒత్తిడిని తట్టుకోలేక మరణించినట్టు రెండుమూడు రోజుల క్రితం మాకు వార్త వచ్చింది. మీరు ఏం చదివినా, ఏ ఉద్యోగం చేసినా ఒత్తిడిని తట్టుకునే మనోబలం ఉండాలి. దైవత్వంతోనే దీనిని సాధించవచ్చు. దేవుడిపై విశ్వాసాన్ని ఉంచండి. దీని ద్వారా మీ ఆత్మశక్తి పెరుగుతుంది. ఆత్మశక్తి పెరిగేతే మనోబలం సాధించవచ్చు' అని వ్యాఖ్యానించారు. 'విద్యాసంస్థలు దైవత్వాన్ని, ఆధ్యాత్మికతను తీసుకురావాలి. అప్పుడే మన పిల్లలకు మనోబలం వస్తుంది. ఇదే వారి పురోగతికి, దేశ పురోగతికి ఉపయోగపడుతుంది' అని ఆమె పేర్కొన్నారు.

నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలపై శివసేన (యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది మండిపడ్డారు. 'కఠినమైన సీఏ డిగ్రీని చదవడం ద్వారా ఒత్తిడిని ఎదుర్కొనే మనోబలం అన్నాకు ఉంది. ఆమె ప్రాణాలు తీసిన విషపూరితమైన పని సంస్కృతి, అధిక పని గంటల గురించి మాట్లాడాలి. బాధితురాలిని నిందించడం ఆపండి' అంటూ నిర్మలా సీతారామన్‌ను ఉద్దేశించి 'ఎక్స్'లో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కార్మికుల రోజువారీ కష్టాలను నిర్మల అవమానిస్తున్నారని సీపీఐ ఎంపీ సంతోష్ కుమార్ విమర్శించారు. అన్నా మరణానికి కారణమైన సమస్యలపై మాట్లాడకుండా దేవుడిని నమ్ముకోండని సలహా ఇవ్వడం వింతగా ఉందని, ఇది కఠినమైనదని పేర్కొన్నారు. నెటిజన్లు సైతం నిర్మల వ్యాఖ్యలను తీవ్రంగా తప్పు పట్టారు.

బాధితురాలిని నిందించలేదు: నిర్మల

తన వ్యాఖ్యలపై వివాదం నెలకొన్న నేపథ్యంలో నిర్మలా సీతారామన్ స్పష్టత ఇచ్చారు. బాధితురాలిని నిందించడం తన ఉద్దేశం కాదని ఆమె పేర్కొన్నారు. 'నేను ఎవరి పేర్లూ తీసుకోలేదు. నేను మాట్లాడిన యూనివర్సిటీలో విద్యార్థులు, అధ్యాపకుల కోసం ధ్యాన మందిరాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థుల మనోబలం పెంచుకోవడానికి ఇది ఎంత అవసరమనే దాని గురించే నేను మాట్లాడాను' అంటూ ఆమె 'ఎక్స్'లో పేర్కొన్నారు.

హిమాచల్ సర్కార్ అప్పు తీసుకొని సోనియాకు ఇస్తుంది

బీజేపీ ఎంపీ కంగన రనౌత్

సిమ్లా: మండీ బీజేపీ ఎంపీ కంగన రనౌత్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కులు జిల్లాలోని షాలిన్ గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ''హిమాచల్‌లో అవినీతి తాండవిస్తున్నదని అందరికీ తెలుసు. కాంగ్రెస్ పాలిత ప్రభుత్వాలు తమ రాష్ట్రాలను ఖాళీ చేస్తున్నాయి. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అంత సొమ్ము ఎలా ఖర్చు పెడుతుందోనని ఆశ్చర్యం కలుగుతుంది. హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు ప్రభుత్వం రుణాలు తీసుకుని, సోనియా గాంధీకి ఇస్తుంది, అందుకే రాష్ట్రం ఖాళీ అయింది'' అని ఆరోపించారు. ప్రకృతి విపత్తులతోపాటు కాంగ్రెస్ పాలన వల్ల రాష్ట్రం దశాబ్దాల వెనుకకు వెళ్లిపోయిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వాన్ని గద్దె దించాలని ప్రజలను కోరారు. తాము విపత్తు సహాయక నిధులను ఇస్తే, ఆ నిధులు సీఎం సహాయ నిధికి వెళ్తాయని, అక్కడి నుంచి సోనియా రిలీఫ్ ఫండ్‌కు చేరుతాయని.. ఇది అందరికీ తెలుసునన్నారు.

కెంపన్న నివేదిక ఇవ్వండి!

- సిద్ధరామయ్య సర్కారును కోరిన గవర్నర్ గెహ్లోట్
- మళ్లీ తెర మీదకు అర్కావతి భూముల కుంభకోణం
- రూ.8 వేల కోట్ల స్కామ్: మాజీ సీఎం బొమ్మై

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 23(నమస్తే తెలంగాణ): ముడా, వాల్మీకి స్కామ్‌లతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న కర్ణాటకలోని సిద్ధరామయ్య ప్రభుత్వాన్ని ఇబ్బందులు వీడట్లేదు. పదేండ్ల కిందటి అర్కావతి లేఅవుట్ భూ కుంభకోణానికి సంబంధించి జస్టిస్ హెచ్ఎస్ కెంపన్న కమిషన్ ఇచ్చిన నివేదిక కాపీని ఇవ్వాలంటూ గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ కోరారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలినీ రజనీశ్‌కు గవర్నర్ కార్యాలయం ఓ లేఖ రాసింది.

ఏమిటీ స్కామ్?

2014లో బెంగళూరు నగరాభివృద్ధిలో భాగంగా అప్పటి సిద్ధరామయ్య సర్కారు భూసేకరణ చేపట్టింది. అయితే, అర్కావతి లేఅవుట్‌లోని దాదాపు 540 ఎకరాలను సేకరించకూడదంటూ సర్కారు డీనోటిఫై చేసింది. అయితే, భూ యజమానులకు లబ్ధి చేకూర్చడానికే ప్రభుత్వం ఇలా చేసిందంటూ ప్రతిపక్షాలు విమర్శలు చేశాయి. దీంతో అప్పటి సిద్ధరామయ్య సర్కారు జస్టిస్ కెంపన్న నేతృత్వంలో ఓ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. దీనిపై విచారించిన కమిషన్ 2017లో సిద్ధరామయ్య ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. అయితే, ఆ నివేదికలోని అంశాలు ఇప్పటివరకూ బయటపెట్టలేదు. దీనిపై బీజేపీ ఎమ్మెల్సీ సీటీ రవి గత నెల గవర్నర్‌కు లేఖ రాశారు. నివేదికలోని అంశాలను బయటపెట్టాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలోనే గవర్నర్ ప్రభుత్వానికి లేఖ రాశారు.

8 వేల కోట్ల స్కామ్?

అర్కావతి లే అవుట్ భూ కుంభకోణం విలువ రూ. 8 వేల కోట్లని, కోర్టు ఆదేశాలను కూడా పట్టించుకోకుండా అప్పటి సిద్ధరామయ్య సర్కారు 868 ఎకరాల భూమిని సేకరించకుండా విడిచిపెట్టిందంటూ 2023 ఫిబ్రవరిలో అప్పటి సీఎం బసవరాజ్ బొమ్మై శాసనసభలో ఆరోపించారు. ఈ మేరకు కెంపన్న కమిషన్ రిపోర్ట్‌ను ఉదహరించారు.

ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోల మృతి

కొత్తగూడెం క్రైం: ఛత్తీస్‌గఢ్, అబూజ్‌మడ్ అడవుల్లో సోమవారం సాయంత్రం భద్రతా దళాలతో జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మరణించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం, మావోయిస్టులు సంచరిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు భద్రతా దళాలు నారాయణ్‌పూర్ జిల్లాలోని అడవుల్లో సెర్చింగ్ ఆపరేషన్స్ నిర్వహించాయి. అప్పటికే మాటువేసిన మావోయిస్టులు జవాన్లపైకి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన జవాన్లు ఎదురు కాల్పులకు దిగడంతో, మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే అడవిలోకి పారిపోయారు.

కేజ్రీ కోసం కుర్చీ ఖాళీగా!

సోమవారం ఢిల్లీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఆతిశీ, కేజ్రీవాల్ వాడిన కుర్చీని కాకుండా మరో కుర్చీ వేసుకొని విధులు నిర్వర్తించారు. రామాయణంలో భరతుడిలా నాలుగు నెలలపాటు ఢిల్లీకి సీఎంగా ఉంటానని ఆమె అన్నారు. అయితే ఆతిశీ వేరే కుర్చీలో కూర్చొని రాజ్యాంగాన్ని, సీఎం స్థాయిని అవమానపర్చారని విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

లౌకికవాదం మన దేశానికి అక్కర్లేదు

తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి

చెన్నై: తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి అతి పెద్ద వివాదానికి తెర తీశారు. కన్యాకుమారిలో ఈ నెల 22న ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ, ''ఈ దేశ ప్రజలకు వ్యతిరేకంగా అనేక మోసాలు జరిగాయి. వాటిలో ఒకటి లౌకికవాదం గురించి తప్పుడు వివరణ ఇవ్వడం. లౌకికవాదం అంటే ఏమిటి? లౌకికవాదం అనేది యూరోపియన్ భావన. అది భారతీయ భావన కాదు'' అని చెప్పారు. యూరోప్‌లో చర్చ్, రాజు మధ్య సంఘర్షణ కారణంగా లౌకికవాదం అనే భావన ఉత్పన్నమైందన్నారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాజ్యాంగాన్ని రాసేటపుడు లౌకికవాదంపై చర్చను ఒకరు ప్రతిపాదించారని తెలిపారు. అప్పుడు, యావత్తు రాజ్యాంగ సభ స్పందిస్తూ, ''మన దేశంలో లౌకికవాదమా? ఏదైనా సంఘర్షణ ఉందా? ధర్మం నుంచి భారత్ ఆవిర్భవించ